కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు

10మంది కౌన్సిలర్ల చేరిక • కండువాలు కప్పి ఆహ్వానించిన సీఎం



కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్‌లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన 10 బీఆర్ఎస్ కౌన్సిలర్లు కారు దిగారు. 10 మంది కౌన్సిలర్లు వారి అనుచరగణంతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో 1వ వార్డు కౌన్సిలర్ మానస శ్రవన్‌కుమార్‌గుప్తా, మూడో వార్డు కౌన్సిలర్ జాకటదేవ, 21వ వార్డు కౌన్సిలర్ నారెడ్డి కృష్ణవేణి, ఏడో వార్డు కౌన్సిలర్ సాయికుమార్, 10వ వార్డు కౌన్సిలర్ బత్తుల శివకుమార్ యాదవ్ , 12వ వార్డు కౌన్సిలర్ బత్తుల ప్రియాంక మధుకర్‌యాదవ్, 11వ వార్డు కౌన్సిలర్ సుహాసినీ రవీందర్ , 22వ వార్డు కౌన్సిలర్ సాటే మాధవి నరేందర్, వైస్ చైర్మన్ చీర్ల రమేష్ ఉన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ ,మ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ కౌన్సిలర్లు రాఘవేందర్‌గౌడ్, మణికంఠగౌడ్, చాపరాజు,మల్లేష్‌గౌడ్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు. 10 మంది కౌన్సిలర్లు పార్టీలో చేరడంతో మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు బలం 14కు పెరిగింది. ఎన్నికల సమయంలో నలుగురు గెలవగా ఒకరు కాంగ్రెస్‌లో చేరారు.

సగం మంది నాటి కాంగ్రెస్ వారే..

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్‌లలో మెజారిటీ సభ్యులు కాంగ్రెస్‌కు చెందిన వారే. వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు దేవ, కృష్ణవేణి రవీందర్‌రెడ్డి, తదితరులు గతంలో కాంగ్రెస్‌లో ఉండి బీఆర్ఎస్‌లో చేరిన వారే.

సీతారామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం



సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి

కీసర: భక్తుల కొంగు బంగారంగా కీసర శ్రీసీతా రామచంద్రస్వామి దేవస్థానంలో గురువారం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ నాయకపు వెంకటేష్ తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న దేవాలయాన్ని భక్తులు, దాతల సహకారంతో పునర్నిర్మాణం చేసి ఏడాది క్రితం ఆలయంలో శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు తెలిపారు. ప్రథమ వార్షికోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



కీసరలో ఎల్లమ్మ తల్లి విగ్రహ ఊరేగింపు

కీసర: మండల కేంద్రమైన కీసరలో ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ, పెద్దమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు పూజా కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. పూజల్లో స్థానిక ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజలు వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: రోజురోజుకూ పెరుగుతున్న ఎండల కారణంగా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేలా నివారణ చర్యలు చేపట్టాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీహాల్‌లో జాతీయ కార్యక్రమంలో భాగంగా 'వాతావరణ మార్పు– మానవ ఆరోగ్యం' అనే అంశంపై బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వడదెబ్బ నివారణ చర్యల్లో భాగంగా పలు కార్యక్రమాల నిర్వహణలో జిల్లా వైద్య, విద్య, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, వ్యవసాయ, పశుసంవర్ధక, పబ్లిక్ వర్క్స్, పర్యావరణ, కాలుష్య నివారణ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. వడదెబ్బకు ప్రజలు గురికాకుండా ఉండేందుకు కూడళ్ల దగ్గర, పార్కుల వంటి స్థలాల వద్ద చలి వేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి, తాగునీటి కేంద్రాలు, చలి వేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (డీఎంహెచ్ఓ) డాక్టర్ రఘునాథస్వామి, డీఆర్‌డీఓ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాబితో మల్లారెడ్డి యూనివర్సిటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న యూనివర్సిటీ వీసీ, క్యాబి ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ బుధవారం సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్సెస్ ఇంటర్నేషనల్(క్యాబి)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ వీఎస్‌కే రెడ్డి, క్యాబి రీజనల్ డైరెక్టర్ వినోద్ పండిత్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ డీన్ రాజారెడ్డి మాట్లాడుతూ ఈ ఒప్పందంతో వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం, ప్లాంట్వైజ్ ప్లస్ నాలెడ్జ్ బ్యాంక్, ఫ్యాక్ట్ షీట్ లైబ్రరీ ఆఫ్ క్యాబి బయోప్రొటెక్షన్ పోర్టల్ ద్వారా క్రాప్ స్ప్రేయర్ యాప్ ద్వారా అగ్రికల్చర్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తుందన్నారు. దీంతో విద్యార్థులు మరింత పరిజ్ఞానం పొందుతారని తెలిపారు. సమగ్ర సస్య రక్షణ విధానంపై రైతులకు విజ్ఞానాన్ని అందించి తద్వారా అధిక దిగుబడులకు, సుస్థిర వ్యవసాయానికి మరింత మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో అగ్రి డిజిటల్ టూల్స్ కోఆర్డినేటర్ మధు మంజరి, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, మేడ్చల్ జిల్లా: మే 1 నుంచి 31 వరకు 14 సంవత్సరాలలోపు వయసు కలిగిన బాలబాలికలకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా క్రీడలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి బలరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాల నిర్వహణకు ఆసక్తి కలిగిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ నేషనల్ క్రీడాకారులు, సీనియర్ క్రీడాకారులు తాము నిర్వహించాలనుకుంటున్న క్రీడలు, ప్రదేశాలు, గ్రామం పేరుతో సహా మొబైల్ నంబర్ తదితర వివరాలతో కూడిన దరఖాస్తులను జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో ఈ నెల 18 వరకు అందజేయాలని ఆయన కోరారు. క్రీడలు నిర్వహించే వారికి గౌరవ వేతనంతో పాటు క్రీడా సామాగ్రి అందజేస్తామన్నారు.

అనుకున్నదొకటి.. అయ్యిందొకటి..

- చైర్ పర్సన్ పావనీజంగయ్యపై వీగిన అవిశ్వాసం
- కౌన్సిల్ సభ్యులందరూ గైర్హాజరు
- ఆధిపత్యపోరుతో చైర్ పర్సన్‌ను కోల్పోయిన బీఆర్ఎస్
- బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన చైర్ పర్సన్



అవిశ్వాసం ప్రత్యేక సమావేశం వివరాలు వెల్లడిస్తున్న ప్రిసైడింగ్ ఆఫీసర్ ఉపేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనీజంగయ్య యాదవ్‌ను గద్దెదించాలని సొంత పార్టీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. కౌన్సిల్‌లో మొత్తం 18 మంది కౌన్సిలర్లు ఉండగా చైర్ పర్సన్‌ను దించాలని మార్చి 16న 12 మంది సభ్యులు తిరుగుబాటు జెండా ఎగురు వేసి క్యాంపు రాజకీయానికి తెరలేపిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశం మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ ఆఫీసర్ వెంకట ఉపేందర్ రెడ్డి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ప్రారంభించగా 11.30 గంటల వరకు, తిరిగి 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎదురుచూసిన బలనిరూపణకు ఎవరూ హాజరుకాలేదు. దీంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటించారు. సాధారణంగా అవిశ్వాసం పెట్టిన వారు క్యాంపునకు వెళ్లడం ఆనవాయితీ కానీ ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో మెజార్టీ కౌన్సిల్ సభ్యులు అనుకున్నదొకటైతే మరొకటి జరిగింది. ఈ నెల 3న అవిశ్వాసం పెట్టిన 12 మంది కౌన్సిలర్లలో ప్రత్యేక సమావేశానికి ముందే ఇద్దరిని చైర్ పర్సన్ తమవైపు తిప్పుకొని విహారయాత్రకు వెళ్లారు. దీంతో అవిశ్వాసం వీగిపోవడం దాదాపు ఖాయం అయ్యింది. అవిశ్వాసం సజావుగా జరిగేలా ఘట్‌కేసర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బీఆర్ఎస్‌కు చైర్ పర్సన్ రాజీనామా..

మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజయం కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్న ఉమ్మడి ఘట్‌కేసర్ మండలం సమావేశం జరిగిన రోజే బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. చైర్ పర్సన్‌ను కుర్చీ దించాలని సొంత పార్టీ కౌన్సిలర్లే పావులు కదపడం, ఎమ్మెల్యే మల్లారెడ్డి స్వయంగా ఫోన్ చేసి వారితో సంతకాలు చేయించారని తెలిసింది. మున్సిపాలిటీని అభివృద్ధి చేసి రెండుసార్లు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు గెలుచుకున్న తమపై అవిశ్వాసం పెట్టించడం, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అవిశ్వాసాన్ని ఆపకపోవడమే కాకుండా మోసం చేసినందుకు మనస్తాపంతో చైర్ పర్సన్ ముల్లి పావనీజంగయ్యాయాదవ్ బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు.



ముల్లి పావనీజంగయ్యాయాదవ్
చైర్ పర్సన్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

రంజాన్‌కు ముస్తాబు

మేడ్చల్: ముస్లింలు అత్యంత పవిత్రంగా నెల రోజుల పాటు ఉపవాస దీక్షల అనంతరం నిర్వహించుకునే రంజాన్ పండగకు ఈద్గాలను ముస్తాబు చేశారు. గురువారం పండగను ఉండటంతో నిర్వహకులు, మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మేడ్చల్‌లో ఈద్గా, దర్గా వద్ద, పెద్ద మజీద్‌లో ప్రార్థనలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఈద్గాలో ఉదయం 8గంటలకు, హజరత్ జిందా షా మదార్ దర్గాలో 9గంటలకు, పెద్ద మజీద్, చెక్ పోస్ట్ ఏక్‌మినార్‌లో ఉదయం 9.30 గంటలకు ప్రార్థనలు చేస్తారని మత పెద్దలు తెలిపారు.

బీజేపీ అర్బన్ జిల్లా కన్వీనర్‌గా మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా భారతీయ జనతా పార్టీ(బీజేపీ) కన్వీనర్‌గా డా.ఎస్.మల్లారెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, అర్బన్ జిల్లా కో–కన్వీనర్లుగా యాంజాల పద్మయ్య, వి.ప్రసన్న నాయుడు(అడ్వకేట్)ను నియమించినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

రాములగుట్ట బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

శామీర్‌పేట్: లక్ష్మాపూర్ రాములగుట్ట బ్రహ్మోత్సవాల ఆహ్వాన, వాల్ పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, స్థానిక నాయకుల సహకారంతో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు అన్నారు. రాములగుట్ట ఆలయ చైర్మన్ చిత్తయ్యగౌడ్, ఎంపీటీసీ నాగరాజు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, పలువురు కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్వీనగర్ సమీపంలో బస్‌షెల్టర్ తొలగించిన ప్రదేశం ఇదే..



గతంలో ఉన్న బస్‌షెల్టర్

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని ఎస్వీనగర్ ప్రధాన రహదారిపై రాయల్ ఓక్ ఫర్నిచర్ షాప్ పక్కన భారీ షెడ్ నిర్మిస్తున్న యజమాని బస్ షెల్టర్‌ను రాత్రిరాత్రే తొలగించాడు. ఎన్నో ఏళ్ల నుంచి అక్కడ బస్ షెల్టర్ కొనసాగుతోందని, దాన్ని తొలగించిన యజమానిపై చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం 9వ వార్డు కౌన్సిలర్ కొముర్లెల్లి అనితాసుధాకర్‌రెడ్డి నాగారం కమిషనర్ రాజేంద్రకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, చైర్మన్ చంద్రారెడ్డి, అధికారులు స్పందించి బస్‌షెల్టర్ తొలగించిన వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని కోరారు. ఇదే విషయమై నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్‌ను వివరణ కోరగా బస్‌షెల్టర్ తొలగించిన వ్యక్తులపై కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో అమ్మ ఆదర్శ కమిటీలు వేశాం

- సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బుధవారం సచివాలయం నుంచి జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, తాగునీటి సరఫరా, పాఠశాలల మరమ్మతులు, సమ్మర్ యాక్షన్ ప్లాన్, ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ బ్యాంక్ అకౌంట్స్ సెర్ప్, డీఆర్‌డీఏ ద్వారా చేయించడం జరుగుతుందని తెలిపారు. ఎస్టిమేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, త్వరలో గ్రౌండింగ్ పూర్తవుతుందన్నారు. గుర్తించిన ప్రభుత్వ పాఠశాలలో అత్యవసర పనులు వచ్చే విద్యా సంవత్సరం లోపు పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో తాగునీరు అందించే వనరులను గుర్తించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్‌రెడ్డి, డీఈవో విజయకుమారి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, డీపీఓ వెంకయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రఘునాథస్వామి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి



కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

జవహర్‌నగర్: తెలంగాణ ఆదర్శ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డిని కలిసి వేతనాలు పెంచాలని వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా తమకు వేతనాలు లేవని, ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు పెంచాలని కోరారు. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శివబాబు, ఉపాధ్యక్షులు రాములు, చందర్, ప్రేమ్‌కుమార్, తిరుపతి, ప్రకాష్, పరుశురాం, మల్లేష్, జాన్, కరుణమ్మ, రేణుక, వెంకమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని ఆశ్రమానికి తరలించిన పోలీసులు



ఘట్‌కేసర్: రోడ్డుపై తిరుగుతున్న మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలిని స్థానికులు, పోలీసులు చౌదరిగూడ లహరి వృద్ధాశ్రమానికి బుధవారం అప్పగించారు. బైపాస్ రోడ్డులోని వందన హోటల్ వద్ద స్థానికులు రాజు, దయాకర్ ఆమెను గుర్తించి సీఐ సైదులు, ఎస్సై అశోక్‌కు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు ఆమెను వెంటనే చౌదరిగూడ లహరి వృద్ధాశ్రమంలో చేర్పించారు.

వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

– జిల్లా యువజన, క్రీడల అధికారి బలరామారావు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని దేవరయంజాల్ ఎస్సీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ భవనంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో టైలరింగ్, కంప్యూటర్, బ్యూటీషన్, మొబైల్ సర్వీసింగ్, డొమెస్టిక్ ఎలక్ట్రీషియన్, సోలార్ టెక్నీషియన్, సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్/రిపేరింగ్ మొదలైన వాటిలో వృత్తి శిక్షణ ఇస్తామని జిల్లా యువజన, క్రీడల అధికారి బలరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ట్రేడ్‌లలో శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రం లేదా ఫోన్: 79894 05049, 92902 17274.

సెయింట్ మేరీస్‌లో రంజాన్ వేడుకలు



శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని సెయింట్ మేరీ సెంటర్ స్కూల్‌లో రంజాన్ వేడుకలను బుధవారం నిర్వహించారు. విద్యార్థులు ప్రత్యేక దుస్తులు ధరించి స్నేహ బంధంతో ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కరస్పాండెంట్ వరప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవాభావం కలిగిన యువత సివిల్ సర్వీసెస్‌లోకి రావాలి



సిగ్నేచర్ ఐఏఎస్ అకాడమీని ప్రారంభిస్తున్న ప్రసాద్‌కుమార్

బోడుప్పల్: యువత దేశ సేవలో పాల్గొనడానికి సివిల్ సర్వీసెస్ అద్భుతమైన వేదికని తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఉప్పల్ డిపో వద్ద చెన్నారెడ్డి ఎన్‌క్లేవ్‌లో బుధవారం నూతనంగా ఏర్పాటైన సిగ్నేచర్ ఐఏఎస్ అకాడమీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత యువతను దృష్టిలో ఉంచుకుని ఐఏఎస్ అకాడమీని స్థాపించడం అభినందనీయమన్నారు. సివిల్స్ సర్వీసెస్ విద్యార్థులందరూ సేవాభావం కలిగి ఉండాలని ఆయన సూచించారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులతో ఆయన సంభాషించారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, సిగ్నేచర్ ఐఏఎస్ అకాడమీ ఫౌండర్, డైరెక్టర్ ఆర్ఎస్‌రెడ్డి, నాయకులు సాయిజెన్ శేఖర్ పాల్గొన్నారు.

పల్లె గల్లా.. నిండేనా..?



- గ్రామ సీమల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరు
- లక్ష్యం రూ.25.26 కోట్లు.. వసూలైంది రూ.23 కోట్లే..
- పన్నుల వసూళ్లలో ఘట్‌కేసర్ మండలం ఫస్ట్
- శామీర్‌పేట మండలానికి లాస్ట్ ప్లేస్
- ఎన్నికల నేపథ్యంలో పన్నుల వసూళ్లలో జాప్యం
- ఆశించిన స్థాయిలో వసూళ్లకు చర్యలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: పల్లెసీమల అభివృద్ధికి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. ఇవి సకాలంలో వసూలైతేనే అన్ని రంగాల్లో ప్రగతి సాధ్యమవుతుందనేది వాస్తవం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న ఆర్థిక సంఘం, ఎస్ఎఫ్‌ఎసీ నిధులతో పాటు ఇంటిపన్ను కీలకంగా ఉంటుందన్న విషయం తెలిసిందే. అయితే మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఏటా జిల్లా అధికారులు ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పన్నుల వసూళ్లను వంద శాతం చేపట్టాలని ఆదేశిస్తుండటం చేస్తుంటారు. ఇందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించడంతో పాటు సిబ్బందిని అప్రమత్తం చేస్తుంటారు. 2023–24లోనూ జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు తంటాలు పడుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం సర్పంచుల పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. ఈ క్రమంలో ఏ మేరకు లక్ష్యం చేరుకుంటారో అనే సందిగ్ధంలో పన్నుల వసూళ్లు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. దీనికి తోడు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పన్నుల వసూళ్లలో జాప్యం జరుగుతోంది. పన్నుల వసూళ్ల విషయంలో ప్రజలపై ఒత్తిడి పెంచితే.. ఏవిధమైన ఇబ్బందులు ఎదురవుతాయన్న భయం కూడా పంచాయతీ ఉద్యోగులను వెంటాడుతోంది. ఇదిలా ఉండగా, పన్నుల వసూళ్లలో ఇంకా జాప్యం జరిగితే.. గ్రామాల అభివృద్ధి కుంటుపడటంతో పాటు పంచాయతీ సిబ్బందికి జీతభత్యాలు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ వంటి కార్యక్రమాలపై పెను ప్రభావం పడగలదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పన్నుల వసూళ్లు ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 61గ్రామ పంచాయతీల పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.25.26 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.23 కోట్లు(91.03 శాతం) మాత్రమే వసూలయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం(మార్చి 31) ముగిసి, పది రోజులు గడిచినా రూ.2.26 కోట్ల పన్నులు మిగిలి ఉన్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అత్యధికంగా ఘట్‌కేసర్ మండలం పరిధిలోని 11 గ్రామ పంచాయతీల్లో రూ.7.69 కోట్ల పన్నుల వసూళ్ల లక్ష్యానికి, ఇప్పటి వరకు 7.22 కోట్లు(93.88 శాతం) వసూలు చేశారు. అత్యల్పంగా శామీర్‌పేట మండలంలో రూ.4.21కోట్లకు గానూ ఇప్పటి వరకు రూ.3.60కోట్లు(85.61శాతం) వసూలయ్యాయి. అలాగే, కీసర మండలం పరిధిలోని 10 గ్రామ పంచాయతీల్లో రూ.3.67 కోట్లకు గానూ, రూ.3.35 కోట్లు(91.39శాతం), మేడ్చల్ మండలం పరిధిలోని 17 గ్రామ పంచాయతీల్లో రూ.7.53 కోట్లకు గానూ, రూ.6.83 కోట్లు(90.80శాతం) వసూలయ్యాయి. మూడుచింతలపల్లి మండలం పరిధిలోని 13 గ్రామ పంచాయతీల్లో రూ.2.14 కోట్లకు గానూ, ఇప్పటి వరకు రూ.1.96 కోట్లు(91.68శాతం) పన్నులు వసూలయ్యాయి.

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మిగిలిన పన్ను రూ.2.26 కోట్ల వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించటంతో పాటు ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. కొందరు అధికారులు గడిచిన రెండు నెలల నుంచే ముందస్తుగా వసూళ్లు ప్రారంభించడంతో సక్సెస్ అయినట్లు తెలుస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రత్యేక డ్రైవ్‌తోనే పన్నుల వసూళ్లు సాధ్యమైనట్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే బకాయిలు అధికంగా ఉన్న గ్రామ పంచాయతీలపై అధికారులను అప్రమత్తం చేస్తున్న జిల్లా పంచాయతీ శాఖ ఎంపీఓలు, కార్యదర్శులు, సిబ్బంది కూడా రోజు వారి పన్నుల వసూళ్ల కార్యాచరణతో ముందుకు సాగేలా చర్యలు చేపడుతోంది.